సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 29 । ఏప్రిల్ । 2023

I



చీనీ టన్ను రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.39 వేలు పలికాయి. మార్కెట్‌కు 701 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.6

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4.50 పలికింది.

గరిష్టం/కనిష్టం

40.9°/ 23.2°

జిల్లాలో శుక్రవారం సూర్యప్రతాపం అధికంగా ఉంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

8న అప్రెంటిస్‌షిప్ మేళా



లేపాక్షి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మే 8వ తేదీన అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బద్రినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు జిల్లాలోని పారిశ్రామికవేత్తలు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. పది, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు https://apprenticeshipindia. org వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఐటీఐ కళాశాలలో జరిగే మేళాకు హాజరుకావాలని సూచించారు.

నేడు 'నవోదయ' పరీక్ష



లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం (2023–24 విద్యాసంవత్సరం) శనివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారి కోసం 42 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

చౌకదుకాణాలు తనిఖీ చేయాలి



సివిల్ సప్లయిస్ అధికారులతో మాట్లాడుతున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: సీఎస్‌డీటీలు తరచూ చౌక దుకాణాలను తనిఖీ చేస్తూ ఉండాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సివిల్ సప్లయిస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎస్‌డీటీలు చౌకదుకాణాలు, ఎండీయు వాహనాలు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోడౌన్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. తనిఖీలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పాఠశాలల్లో రాగిజావ పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్‌ను పరిశీలిస్తూ సివిల్ సప్లయిస్ శాఖ నుంచి అన్నీ వెళ్తున్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. ఫోర్టిఫైడ్ రైస్‌ను ఎలా వండాలో వీడియోల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న ఎండీయూ వాహన ఆపరేటర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ సింధు, డీఎంఓ అశ్వర్థ నారాయణనాయక్, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ధర్మవరం: చేనేత రిజర్వేషన్‌చట్టం ద్వారా నిషేధించిన 11 రకాల చీరలను పవర్‌లూమ్స్‌పై తయారుచేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, అసిస్టెంట్ డైరెక్టర్ అప్పాజీలు తెలిపారు. శుక్రవారం వారు పట్టణంలోని శమీ నారాయణస్వామి దేవాలయంలో హ్యాండ్ లూమ్స్ యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పవర్‌లూమ్స్ నిర్వాహకులు కేవలం వారికి కేటాయించిన డిజైన్లు మాత్రమే తయారు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

30న తల్లిదండ్రుల సమావేశం


పుట్టపర్తి అర్బన్: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల చివరి పనిరోజైన ఈ నెల 30వ తేదీ (ఆదివారం) తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని డీఈఓ మీనాక్షి శుక్రవారం ప్రకటనలో సూచించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న పాఠశాలలకు మే 1వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకూ వేసవి సెలవులు ఉంటాయన్నారు. సెలవుల్లో విద్యార్థులు చేయవలసిన కార్యక్రమాల గురించి తల్లిదండ్రుల సమావేశంలో తెలియజేయాలన్నారు.

గీత దాటితే మోతే!



- హిందూపురానికి చెందిన సురేష్ పనిమీద బైక్‌పై ఆర్టీసీ బస్టాండుకు వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో బస్టాండు సమీపంలోని సెంటర్లో రెడ్ సిగ్నల్ పడింది. కానీ అక్కడ ట్రాఫిక్ సిబ్బంది ఎవరూ లేరన్న ధీమాతో సురేష్ ముందుకు వెళ్లిపోయాడు. సిగ్నల్ జంప్ చేసినందుకు ఈ–చలాన్ వేసి సాయంత్రానికి అతని సెల్‌కు పోలీసులు మెసేజ్ పంపారు.
- అనంతపురానికి చెందిన రాము పనిమీద కారులో పుట్టపర్తికి వెళ్లాడు. అధికారులు నిర్ణయించిన దానికంటే వేగంగా కారు నడిపాడు. పైగా సీటు బెల్టుపెట్టుకోలేదు. తననెవరూ చూడలేదని తిరిగి ఇంటికి చేరాడు. రెండు రోజులకు 'నో సీట్ బెల్ట్'... 'ఓవర్ స్పీడ్' కింద పోలీసులు జరిమానా వేసి ఇంటికి చలాన్ పంపారు.

..ఇలా మనం ఎక్కడ ఏ నిబంధన ఉల్లంఘించినా పోలీసు నిఘా నేత్రం పట్టేస్తోంది. నేరుగా ఈ–చలాన్ ఇంటికి వస్తోంది. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుండగా ఈ–చలాన్లు పెరగ్గా...ప్రమాదాలు బాగా తగ్గాయి.



ఏడాది వ్యవధిలో ఇలా..

ఈ–చలానాల సంఖ్య:	1,60,229
వసూలు చేసిన మొత్తం :	రూ.3,15,72,750
డ్రంకన్ డ్రైవ్ కేసులు :	255
వసూలు చేసిన జరిమానా :	రూ.2,24,000

- నిరంతరం పనిచేస్తున్న పోలీసు నిఘా నేత్రం
- నిబంధనలు ఉల్లంఘించే వాహనాదారులపై చర్యలు
- సీసీ కెమెరాల ఆధారంగా ఈ–చలానాలు
- మద్యం తాగి బండి నడిపితే భారీగా జరిమానా
- ఏడాదిలో 1.60 లక్షల కేసుల నమోదు
- నిబంధనలు కట్టుదిట్టంతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు

సాక్షి, పుట్టపర్తి: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నారు. అలాగే సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఈ–చలానాను రిజిష్టర్ మొబైల్ నంబరుకు పంపిస్తున్నారు. అంతేకాకుండా పదేపదే పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. వారాంతపు రోజుల్లో డ్రంకర్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి.

నెలాఖరులో ప్రత్యేక డ్రైవ్..

వాహనదారులు రోడ్లపైకి వచ్చి నిబంధనలు పాటించకుండా తిరగడం. లైసెన్సు లేకుండా వాహనం నడపడం. హెల్మెట్ లేకుండా టూవీలర్, సీటు బెల్టు పెట్టుకోకుండా ఫోర్ వీలర్ డ్రైవ్ చేస్తున్నారు. అయితే వాహనం ఆపితే కానీ లైసెన్సు ఉందో లేదో తెలీదు.. కానీ హెల్మెట్, సీటు బెల్టు విషయంలో సీసీ కెమెరాల ఆధారంగా పట్టేస్తున్నారు. దీనికి తోడు ప్రతి నెలా చివరి వారంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో మైనర్లు కూడా వాహనాలు నడుపుతూ బుక్ అవుతుండటం విశేషం.

ప్రధాన రహదారులపై అధికం..

జాతీయ రహదారులతో పాటు మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. లైసెన్సులు లేని వారికి.. మద్యం తాగి వాహనం నడిపే వారికి జరిమానా విధిస్తున్నారు. ఫలితంగా రోడ్లపై విచ్చలవిడిగా వీరవిహారం చేద్దామనుకునే వారి బండ్లకు బ్రేకులు పడుతున్నాయి.

నిబంధనలు పాటిస్తేనే..

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే.. రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో కట్టడి చేసే అవకాశం ఉంటుంది. సురక్షితమైన ప్రయాణమే పోలీసుల లక్ష్యం. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి.. ఆయా ప్రమాదాలకు గల కారణాలపై అధ్యయనం చేస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధిస్తున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య గతేడాదితో పోలిస్తే ఈసారి తగ్గినట్లు పోలీసులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాల్సిందే..

ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, మెయిన్ రోడ్డు జంక్షన్లలో అమర్చిన సీసీ కెమెరాలు పట్టేస్తాయి. ఫలితంగా ఈ–చలానా ఇంటికి వస్తుంది. వాహన నంబరు పరిశీలిస్తే గతంలో విధించిన జరిమానాలు కూడా వెంటనే తెలిసిపోతున్నాయి. పోలీసులు లేరని తిరిగితే 'మూడో కన్ను' వదిలిపెట్టదు.

360 డిగ్రీల్లో పనిచేసే నిఘా నేత్రం..

జంక్షన్లలో ఏర్పాటు చేసిన కెమెరాలు ఎప్పటికప్పుడూ ఆయా ప్రాంతాల్లో జరిగే దృశ్యాలను బంధిస్తుంటాయి. పాన్, పింట్, జూమ్.. అటూ ఇటూ చూడటం.. 360 డిగ్రీల కోణంలో తిరిగి అన్ని దృశ్యాలను రికార్డు చేస్తాయి. కెమెరా అమర్చిన ప్రాంతం నుంచి చుట్టుపక్కల 500 మీటర్ల మేర ఫొటోలను క్లిక్ మనిపిస్తాయి. ఇవన్నీ పోలీసు కంట్రోల్ రూంతో అనుసంధానమై ఉంటాయి. దీంతో పోలీసు అధికారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారి వాహనాల ఫొటోల ఆధారంగా వాహనదారుడి ఇంటికి ఈ–చలాన్ పంపిస్తున్నారు.

నిక్కచ్చిగా వ్యవహరిస్తాం



ట్రాఫిక్ నిబంధనల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తాం. ప్రజాక్షేమం దృష్ట్యా పోలీసులకు సహకరించాలని కోరుతున్నాం. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలి. అప్పుడు వేగంగా తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. – ఎస్వీ మాధవ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ

నేరాల నియంత్రణలో మహిళా పోలీసులు కీలకం

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మాధవరెడ్డి



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: నేరాల నియంత్రణలో మహిళా పోలీసుల పాత్ర చాలా కీలకమని ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సచివాలయ మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళా పోలీసులు గ్రామాల్లో వరకట్న వేధింపులు, బాల్యవివాహాలు, కుటుంబ తగాదాలు ఎక్కువగా ఉంటాయని, వాటి గురించి ఎప్పటికప్పుడు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి మహిళ 'దిశ' యాప్ వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మొదలైన విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. స్త్రీలు, బాలికలు, లైంగిక దోపిడీకి గురికాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో నాటు సారాతయారీ, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసు అధికారులకు చేరవేయాలన్నారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబరచిన పలువురు మహిళా పోలీసులను ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విధుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, 'దిశ' సీఐ లక్ష్మన్న, సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

13న మెగా లోక్ అదాలత్

కొత్తచెరువు: రాజీ పడదగిన కేసుల సత్వర పరిష్కారం కోసం మే 13వ తేదీన మెగాలోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా జడ్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమావేశం నిర్వహించి విజయవంతానికి కృషి చేయాలని సూచించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అలాగే బుక్కపట్నం ప్రాంతానికి చెందిన ఓ అత్యాచార కేసులో బాధితురాలికి రూ.7 లక్షల అవార్డు ఇవ్వాలని జడ్జి ఆదేశించారని వెల్లడించారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తదితరులు



సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యలను అత్యంత వేగంగా నాణ్యంగా పరిష్కరించేందుకు మే 9వ తేదీ నుంచి జిల్లాలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీన్ని గుర్తించి జిల్లా అధికారులంతా పనిచేయాలన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడానికి మే 9వ తేదీ నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఒక్కో కలెక్టర్ ఖాతాలో రూ.3 కోట్ల నిధులు జమ చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్పందన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, భూరక్ష, భూహక్కు పథకం, నాడు–నేడు, సచివాలయ సేవలు, ఇప్పటి వరకూ సాధించిన ప్రగతిపై జిల్లా కలెక్టర్లకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, డీఆర్‌ఓ కొండయ్య జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో పాటు ఆమోదయోగ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలన్నారు. ఈ ప్రక్రియ అంతా సీఎం స్వీయ పరిశీలనలో జరుగుతుందన్నారు. ఇందు కోసం జిల్లాకు ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమిస్తారన్నారు. ఆ అధికారి నెలకు రెండు పర్యాయాలు జిల్లాలో పర్యటిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి నివేదిక ఇస్తారన్నారు. దీనికోసం హెల్ప్‌లైన్ నంబర్ 1902ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేపడితే చర్యలు

రాప్తాడు రూరల్: ఇంటర్ అడ్మిషన్లు ముందస్తుగా చేపట్టే కళాశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ బోర్డు ఉత్తర్వులు రాకముందే అడ్మిషన్లు చేసుకోరాదని సూచించారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక కోచింగ్, సమ్మర్ క్లాసెస్ పేరుతో తరగతులు నిర్వహించకూడదన్నారు. అన్ని యాజమాన్యాల కళాశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం జరిమానా విధించడంతో పాటు గుర్తింపు కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆలోచించి కాలేజీల్లో అడ్మిషన్లపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రలోభాలకు గురై విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించవద్దని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన తేదీల్లో పిల్లలను మీకు ఇష్టమైన కళాశాలల్లో చేర్పించుకోవాలని కోరారు.

సర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారం



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- డ్రోన్ సర్వేను ప్రారంభించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష' పథకం ద్వారా చేపడుతున్న సమగ్ర భూ సర్వేతో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించనున్న భూసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే గ్రామాల్లో ఘర్షణలకు కారణమవుతున్న భూ సమస్యలను పరిష్కరించడానికి రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇప్పటికే రెండు విడతల సర్వే పూర్తి కాగా, మూడో విడతలో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. 15 రోజులు పాటు జరగనున్న రీసర్వేలో మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ కంఠం భూములు, రోడ్లు, భవనాలు, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు, ఖాళీ జాగాలు, పార్కులు, కాలువలు, చిత్రావతి పరివాహక ప్రాంతం, కొండలు, గుట్టలు సర్వే చేసి సంపూర్ణంగా వివరాలు అందజేస్తారన్నారు. దీంతో పాటు విమానాశ్రయం, రైల్వే స్టేషన్, ఆస్పత్రులు...ఇలా అన్నింటినీ సర్వే చేయనున్నట్లు చెప్పారు.

బొల్లి రోగి పాలనలో అంతా కరువే..

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మహాభారతంలో ప్రస్తావించినట్లు బొల్లి వ్యాధి ఉన్న వారు పాలిస్తే.. ఆ రాజ్యం కరువు కాటకాలకు నిలయంగా మారుతుందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలంతా ఇది చూశారన్నారు. వర్షాలు లేక కరువు కాటకాలతో అల్లాడిపోయారన్నారు. అతనో అవుట్ డేటెడ్ పొలిటీషియన్ అన్నారు. అబద్ధాలతో అధికారం చేపట్టి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసగించారన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతల అభివృద్ధి తప్ప, పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. 2019లో వైఎస్ జగన్ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం వచ్చాక వరుణుడు కరుణించాడని, పచ్చదనం పరుచుకోగా రాష్ట్రంలోని అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులకు అందేలా చూస్తున్నామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని పేదల కోసం 25 వేల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, సచివాలయ కన్వీనర్ సూర్యగౌడ, కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, సాయిగీత, నాయకులు నారాయణరెడ్డి, కవిత, తిప్పారెడ్డి, రఘునాథరెడ్డి, సుధాకరరెడ్డి, శంకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ సం॥ అత్యధిక Pass Percentage సాధిస్తున్న సంస్థ.
ఇంటర్ ఫెయిల్
ఇంప్రూవ్‌మెంట్
తేజ రఘువీర టవర్స్, అనంతపురము 9948567527, 9490859421 హాస్టల్ కలదు

ఇంటర్ ఫెయిల్ హాస్టల్ కలదు
శేఖర్ కోచింగ్ సెంటర్
C/o. PRK జూనియర్ కాలేజ్ 3వ రోడ్డు, Opp. G.R. ఫంక్షన్ హాల్, ATP
9440045441
9441551930



క్లుప్తంగా

సోలార్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం



కాలిపోయిన పరికరాలు

పావగడ: తాలూకాలోని తిరుమణి సోలార్ పార్క్‌లో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సోలంట్రా కంపెనీ సుమారు 15 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌లోని సుమారు రూ.18 లక్షల విలువైన పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. దగ్గరలోని ఓ ఆలయం వద్ద నుంచి నిప్పు అంటుకోవడంతో ఎండు గడ్డిలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేయాలని ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో భారీ నష్టం జరిగింది.

గొర్రెల దొంగల అరెస్టు

తాడిమర్రి: మండలంలోని మర్రిమాకులపల్లిలో గొర్రెలను అపహరించిన దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని మర్రిమాకులపల్లిలో ఈ నెల 4న అర్ధరాత్రి మల్లగుండ్ల మల్లికార్జున, మల్లగుండ్ల కోనప్పలకు చెందిన ఐదు గొర్రెలు అపహరణకు గురయ్యాయి. బాధిత గొర్రెల కాపరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ డీ.లక్ష్మీనారాయణ దర్యాప్తు చేపట్టారు. చివరకు మండలంలోని నార్శింపల్లి గ్రామానికి చెందిన మందల పుల్లప్ప కుమారుడు బాలు, దేవరకొండ వీరప్ప కుమారుడు దేవరకొండ నారాయణస్వామి, మందల శ్రీరాములు కుమారుడు మందల రామాంజినేయులు గొర్రెలను దొంగిలించినట్లు తేలింది. దీంతో శుక్రవారం నార్శింపల్లి, నిడిగల్లు గ్రామాల మధ్య వారు తచ్చాడుతుండగా నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఐదు గొర్రెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను ధర్మవరం కోర్టులో హాజరు పర్చగా జడ్జి వారిని రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

సజావుగా వాహనాల వేలం

హిందూపురం: హిందూపురం సెబ్ పోలీసు స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాల వేలం నిర్వహించినట్లు సీఐ స్వర్ణలత తెలిపారు. 12 వాహనాలకు రూ.1,33,500 ధర నిర్ణయించగా వేలంలో 11 వాహనాలు విక్రయించామని పేర్కొన్నారు. వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1,95,500 ఆదాయం వచ్చిందన్నారు.

నార్పల టు లడఖ్



బైక్ యాత్రలో బాలు

- యువకుడి సాహసయాత్ర
- 177 రోజులు బైక్‌పై పయనం
- 10,020 కిలోమీటర్ల సుదీర్ఘ రైడ్

అనంతపురం డెస్క్ : మనం బైక్‌పై వంద, రెండు వందల కిలోమీటర్లు తిరగ్గానే బాగా అలసిపోతాం. బైక్‌లో కంటే బస్సులోనో, రైల్లోనో వెళ్లి ఉంటే బాగుండేదని అనుకుంటాం. కానీ ఆ యువకుడు అలా ఆలోచించలేదు. బైక్‌పై దేశాన్ని చుట్టేయాలన్న తన కోరికను నెరవేర్చుకునేందుకు ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాడు. ఒకట్రెండు కాదు..ఏకంగా 177 రోజులు బైక్‌యాత్ర చేపట్టాడు. 10,020 కిలోమీటర్ల సుదీర్ఘదూరం ప్రయాణించాడు. అందరితో శభాష్ అనిపించుకున్న ఆ యువకుడే నార్పల మండల కేంద్రానికి చెందిన యనమచింతల బాలకృష్ణ అలియాస్ బాలు.

ఆసక్తే ముందుకు నడిపించింది..

బాలు తల్లిదండ్రులు నార్పలలో హోటల్ నిర్వహిస్తున్నారు. అతను కూడా మొబైల్ సర్వీస్ సెంటర్‌తో పాటు టూర్స్ అండ్ ట్రావెల్స్ ఏజెన్సీ ఏర్పాటు చేసుకున్నాడు. మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) చదివినప్పటికీ ఉద్యోగం చేయాలన్న ఆసక్తి లేదు. బైక్‌పై సుదూర ప్రాంతాలకు, కొత్త ప్రదేశాలకు వెళ్లిరావడం హాబీగా మలచుకున్నాడు. ఈ క్రమంలోనే గతంలో రామేశ్వరం, ఊటీతో పాటు కర్ణాటకలోని పలు ప్రదేశాలను బైక్‌పై వెళ్లి చూసొచ్చాడు. గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమండ్రికి కూడా వెళ్లాడు. ఈ కోవలోనే లడఖ్ యాత్రను కూడా విజయవంతంగా పూర్తి చేసి పలువురి మన్ననలు పొందాడు.

సెకండ్ హ్యాండ్ బైక్‌పై యాత్ర

బాలు లడఖ్ యాత్రకు అపాచీ 200 సీసీ సెకండ్ హ్యాండ్ బైక్ పై 2022 జూలై 13న నార్పల నుంచి బయలుదేరాడు. మొదట శ్రీశైల మల్లన్నను దర్శించుకుని యాత్ర కొనసాగించాడు. హైదరాబాద్, నాగపూర్, జాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, ఢిల్లీ, కురుక్షేత్ర, చండీగఢ్, అమృత్‌సర్, జమ్మూ, చీనాబ్ బ్రిడ్జ్, శ్రీనగర్, కార్గిల్ మీదుగా లడఖ్ చేరుకున్నాడు. మార్గమధ్యంలోని ప్రముఖ ప్రదేశాలను సందర్శించి..వాటికి సంబంధించిన వివరాలు సేకరించాడు. లడఖ్ నుంచి తిరుగు ప్రయాణంలో హిమాచల్‌ప్రదేశ్ మీదుగా కాంగ్రా, ధర్మశాల, జ్వాలాముఖి, నైనాదేవి, కేదర్‌నాథ్‌కు వెళ్లాడు. తర్వాత ఢిల్లీ, మహారాష్ట్ర, తెలంగాణ మీదుగా ఈ ఏడాది జనవరి ఐదో తేదీన నార్పలకు చేరుకున్నాడు. సుదీర్ఘయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చిన బాలును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. బైక్ యాత్రలో భాగంగా బాలు పలు వీడియోలు చిత్రీకరించాడు. వాటిలో కొన్నింటిని తన యూట్యూబ్ చానెల్ (బాలు సన్‌రైజ్ ట్రావెలర్)లో అప్‌లోడ్ చేశాడు.

ఆదుకున్న జవాన్లు

ప్రపంచంలోనే రెండవ అత్యంత చల్లని ప్రదేశమైన ద్రాస్ వద్ద (కార్గిల్‌కు సమీపంలో) మైనస్ 10 డిగ్రీల చలిని తట్టుకోలేక బాలు తీవ్ర జ్వరం బారిన పడ్డాడు. దగ్గరలోని వైద్యశాలకు వెళ్లి చూపించుకోగా.. మూడు రోజుల విశ్రాంతి తీసుకోవాలని డాక్టరు సూచించారు. అప్పుడు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి. అలాంటి సమయంలో భారత ఆర్మీ జవాన్లు తమ క్యాంపులో ఉండటానికి చోటు కల్పించారు. ఆరోగ్యం కుదుట పడేవరకు బాగా చూసుకున్నారు. ఆరోగ్యం మెరుగుపడగానే బాలు యాత్ర కొనసాగించాడు. కాగా.. బాలు తీసుకెళ్లిన నగదును జమ్మూలోని డార్మెటరీలో దొంగలు అపహరించారు. దీంతో తల్లిదండ్రులు, స్నేహితులు ఆన్‌లైన్‌లో డబ్బు పంపి ఆదుకున్నారు.

ఎవరెస్ట్‌కు వెళ్లాలనుంది

నాకు బైక్ రైడింగ్‌తో పాటు ట్రెక్కింగ్ కూడా ఇష్టమే. కాలేజీ రోజుల్లో తరచూ ట్రెక్కింగ్ వెళ్లేవాడిని. ఎవరెస్ట్‌ను అధిరోహించాలన్నది లక్ష్యం. కనీసం బేస్ క్యాంపు దాకా వెళ్లినా నా లక్ష్యం నెరవేరినట్టే. బైక్‌యాత్రలో ఎన్నో అద్భుతమైన ప్రదేశాలను సందర్శించా. ఎక్కడా హోటల్‌లో విడిది చేయలేదు. డార్మెటరీలు, ఆలయాలు, గురుద్వారాల్లో విడిది చేస్తూ వెళ్లా. దీనివల్ల తక్కువ బడ్జెట్‌లోనే యాత్ర పూర్తి చేయగలిగా. వాఘా, సుచిత్‌ఘర్, కార్గిల్ దగ్గర.. ఇలా మూడుచోట్ల పాకిస్తాన్ బార్డర్‌ను చూడడం మరచిపోలేని అనుభూతి. – బాలకృష్ణ, నార్పల



ఇండియా - పాకిస్తాన్ బార్డర్ వద్ద బాలు

బేస్‌బాల్ జిల్లా క్రీడాకారుల ఎంపిక రేపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ పురుషుల, మహిళల బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, నరసింహనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికను స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు మే 13 నుంచి 15 వరకు ఆర్ట్స్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 99598 47080, 93472 17905 నంబర్లకు సంప్రదించాలన్నారు.

జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక రేపు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 30న స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఎంపిక కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో ఈవెంట్ల వారీగా ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 5న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు.

2న జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా సీనియర్ పురుషులు, మహిళల టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్టు ఎంపికను మే 2న నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నిస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్వర్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలను స్థానిక నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 8, 9 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

లోకేష్‌కు మతి భ్రమించింది

- ఎమ్మెల్యే శంకర నారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ధర్మవరం మండలం తుంపర్తి, పోతులనాగేపల్లి రైతుల గురించి మాట్లాడుతున్న టీడీపీ నాయకులు.....ఆ రైతులకు అన్యాయం జరిగింది టీడీపీ హయాంలోనే అన్న విషయం మరువరాదన్నారు. భూములిచ్చిన రైతులకు ఎందుకు మెరిగైన పరిహారం ఇవ్వలేకపోయారో చెప్పాలన్నారు. కేవలం పచ్చ మీడియా, టీడీపీ నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేసేందుకు ప్రయత్నించారన్నారు. ఈ క్రమంలోనే నార్పల సభకు వచ్చి వెళ్తున్న సీఎం జగన్ కాన్వాయ్‌కి అడ్డుగా వెళ్లారన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక టీడీపీ నేతలు అమాయకులను రెచ్చగొట్టి ప్రభుత్వ కార్యక్రమాల్లో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రైతులు సంక్షేమం కోసం పాటు పడే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కంబాలప్ప, లక్ష్మీ నరసప్ప, సింగిల్ విండో చైర్మన్లు ఆదినారాయణ రెడ్డి, కొల్లప్ప నాయకులు గజేంద్ర, ఈశ్వర్, నరసింహ మూర్తి, అబ్దుల పాల్గొన్నారు.

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



పర్యాటకశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



బుక్కపట్నం చెరువు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

పుట్టపర్తి అర్బన్: పవిత్ర పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలు ఎక్కువగా ఉన్న శ్రీసత్యసాయి జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో టూరిజం రీజనల్ డైరెక్టర్ రామచంద్రతో కలిసి జిల్లా పర్యాటక అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను చూసేందుకు దేశవిదేశాలకు చెందిన టూరిస్టులు వస్తున్నారని, పర్యాటకుల సంఖ్య ఇంకా పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. దర్శనీయ ప్రాంతాలు, క్షేత్రాల్లో మరమ్మత్తులు, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో అతిథి గృహాలు, అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే లేపాక్షి దగ్గర ఉన్న జటాయువు థీం పార్కును పచ్చదనంతో నింపాలని, తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని, రామగిరి మండలం నసనకోట దుర్గమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. టూరిజం అభివృద్ధిపై త్వరలోనే మరోసారి సమావేశం ఏర్పాటు చేసి ఆర్డీఓలను, పరిశ్రమల శాఖ అధికారులు, 'కియా' కంపెనీ ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, ఏఈ ఈశ్వరయ్య, డివిజనల్ మేనేజర్ చంద్రమౌళిరెడ్డి, డీఈఓ మీనాక్షి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి, కమిటీ మెంబర్లు గంగాధర్, మల్లికార్జున, పద్మనాభం, జ్యోతి కేశవ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం చెరువులో బోటింగ్

పుట్టపర్తి: పుట్టపర్తికి సమీపంలో ఉన్న బుక్కపట్నం చెరువు పర్యాటక రంగానికి అనుకూలంగా ఉందని, ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి బుక్కపట్నం చౌడేశ్వరీ ఆలయం ఎగువ భాగంలోని చెరువు కట్ట, చుక్కొల్లు రాయుడి గుడి, పక్కనే ఉన్న నల్లగుట్ట ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, సర్వేయర్‌లతో కలసి బుక్కపట్నం చెరువు పరిసరాల మ్యాప్‌ను పరిశీలించారు. ఇక్కడ 2 ఎకరాలు స్థలం అందుబాటులో ఉందని, టూరిజం శాఖ ఆధ్వర్యంలో హోటల్ నిర్మాణంతో పాటు బోటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటక సిబ్బందితో పాటు వీఆర్‌ఓలు లక్ష్మీనారాయణరెడ్డి, చంద్ర, సర్వేయర్ ధనుంజయ్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ముబారక్ (ఫైల్)



మృతుడు వెంకట్రాముడు

కదిరి అర్బన్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చనిపోయారు. కదిరి మండల పరిధిలోని కొండమనాయునిపాళెం వద్ద శుక్రవారం ఆటో బోల్తాపడిన ఘటనలో కదిరి పట్టణంలోని నిజాంవలికాలనీకి చెందిన ముబారక్ (42) అక్కడికక్కడే మృతిచెందగా ఖాదర్ బాషా అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. ముబారక్, ఖాదర్‌బాషా పట్టణంలోని ఓ బేకరీలో పనిచేస్తున్నారు. వీరు నల్లమాడ పరిసర ప్రాంతాల్లో స్వీట్లు అమ్ముకునేందుకు ఆటోలో వెళ్లారు. ఆటో కొండమనాయునిపాళెం వద్దకు రాగానే స్టీరింగ్ అదుపుతప్పి ఆటో ముందు చక్రం ఊడిపోయింది. దీంతో ఆటో బోల్తా పడింది. డ్రైవర్ ఖాదర్‌బాషాకు స్వల్పగాయాలయ్యాయి. ఆటోలో కూర్చున ముబారక్ కిందపడిపోగా అతనిపై ఆటో పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి ఇద్దరు సంతానం. రూరల్ మండల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిలోని కొడికొండ చెక్‌పోస్ట్ రక్షా అకాడమీ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరాముడు (46) చనిపోయారు. పోలీసుల వివరాలమేరకు... బెంగళూరు వైపునకు కేఎస్‌ఆర్టీసీ బస్సును వెళ్తోంది. అదే సమయంలో అటు వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఐచర్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టి ఇవతలి రోడ్డులో వెళ్తున్న బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్ వెంకటరాముడు అక్కడికక్కడే మృతి చెందగా, బస్సులోని ప్రయాణికులు నలుగురు గాయపడ్డారు. ఐచర్ బలంగా ఢీకొట్టడంతో బస్సు రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న వారంతా భయాందోళనతో వణికిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు వెంకటరాముడు నార్పల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SUMMER CAMP

■ స్కూల్, కాలేజ్ స్టూడెంట్స్‌ కి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు మే 1 నుండి మే 31 వరకు. ఇంగ్లీష్ రాకపోతే ఫీ వాపస్. # అనోఖా A/C ఇన్స్టిట్యూట్, టవర్‌క్లాక్ దగ్గర, సెల్: B.వెంకటరమణారెడ్డి, 7702890984, 9618220290. [A-724]

B.SC., NURSING ADMISSIONS

■ GOVERNMENT COLLEGES లో B.Sc. (Nursing), B.Sc., (MLT), BPT (ఫిజియోథెరపి) సీట్స్ కోసం. సంప్ర : జి.మురళి, సెల్ : 9030661651, ATP. [A-719]

HOME TUTITONS

■ INTER MATHS HOME TUITITONS, TIMINGS ARE YOUR CHOICE. Contact : 7989646177, 9505277169, Anantapur. [A-745461]

ఇంటర్ పాస్ అయ్యే అవకాశం

■ ఇంటర్ ఫెయిల్ అయిన వారికి, అల్ సబ్జెక్ట్స్‌కు క్లాస్‌లు జరుగుచున్నవి. మా గైడెన్స్, శిక్షణ ద్వారా తప్పకుండా పాసయ్యే అవకాశం. హాస్టల్ వసతి కలదు. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-745464]

NURSING ADMISSIONS

■ ఓన్లీ గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీ లోనే హాస్టల్. Q: ఇంటర్ Any గ్రూప్. సంప్ర॥ G.మురళి, సెల్: 9030661651, ATP. [A-712]

SPOKEN ENGLISH

■ అతిసులువైన పద్ధతిలో స్పోకెన్ ఇంగ్లీష్ & ఇంగ్లీష్ గ్రామర్ బోధన. తె.మీ. విద్యార్థులకు స్పెషల్ బ్యాచ్‌లు. ఫ్రీ డెమో, ఫీ కేవలం 1,500/-. మేధ ఇన్స్టిట్యూట్, రైల్వే స్టేషన్ దగ్గర, నలంద క్యాంపస్, ATP. 9290200675. [A-706]

PARAMEDICAL

■ B.Sc Nursing, BPT & Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1402]

REAL ESTATE

స్థలం అమ్మబడును

■ అనంతపురం సిటీ, మారుతి నగర్, కేపమెంట్ ప్రక్కన (పాత వాణి కాలేజ్) ప్రక్కన 11 సెంట్లు స్థలం అమ్మబడును. (No Mediators). Rate Negotiable. సెల్: 9494873058. [A-720]

LAND FOR SALE

■ NH-7 పామిడి హైవే నుండి 1 KM లోపల 4.86 ఎకరములు మరియు 2.70 ఎకరములు వరి పొలాలు అమ్మబడును. సంప్ర: 9343510635, 9493640270. [C-784703]

PLOTS FOR SALE

■ కియా ఫ్యాక్టరీ దగ్గర, శ్రీనివాసపురం నందు, అహుడా + రెరా అప్రూవల్‌తో అన్ని వసతులతో లగ్జరీ రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లు కలవు. సెల్: 9100942788, 9490621199. [A-745466]

WANTED

■ Jobs : అనంతపురం టౌన్ నందు పని చేయుటకు కొరియర్ డెలివరీ బాయ్స్ & సేల్స్‌మెన్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + వసతి సౌకర్యం కలదు. సెల్: 8921589244. [A-745458]

■ HYDలో ప్రముఖ E-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ, జీతం: 15000-30000. ఫోన్ : 9347467236 [HA-10736]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793419]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-558]

■ ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మా సంస్థను మీ జిల్లాలో అభివృద్ధి చేయగలవారు కావలెను. Mega Group Man Power & Security. 7032610569, 7093125169. [NA-5527]

■ స్టార్ హోంకేర్ HYDలో వృద్ధులు, పేషంట్లకు సేవచేయుటకు, జీడీఏ, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం : 16,000/- టూ 25,000/- రూం + భోజనం ఫ్రీ. ఫోన్: 80081 62793, 86398 28228. [V-794507]

■ ప్రముఖ S.L.N.S. Industries Company అనంతపురం టౌన్ నందు పనిచేయుటకు Female Computer Operator కావలెను సంప్రదించండి : 9441361999, 9440286615. [A-6099]

■ మా సంస్థలో పనిచేయుటకు B.Com., M.Com., or MBA పూర్తిచేసిన అభ్యర్థులు కావలెను. Min Experience 1 year in Tally, M.S. Office, Tax Assistant, Tax Consultants, Ashok Nagar, Anantapuramu. Cell : 9000211675 [A-714]

■ జిల్లాలో నూతనంగా ప్రారంభించిన మా కంపెనీలో 18 మంది స్త్రీ/పులకు ఉద్యోగాలు. జీతం: 13000 + బోనస్ 6000 + ఫ్రీ రూమ్, ఫుడ్. అర్హత : SSC to డిగ్రీ (పాస్/ఫై). సింధు ప్రమోషన్స్, సాయినగర్ 1వ క్రాస్, అనంతపురము. సెల్ : 9701864175. [A-7511]

■ ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఈ 3 నెలల్లో సంపాదించుకునే అవకాశం. సెల్ : 9908829351, అనంతపురము. [A-745462]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786202]

■ హైదరాబాద్ నందు క్రిస్టియన్ హోంకేర్ సర్వీస్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకోవటానికి M/F ఆయాలు కావలెను. మంచి జీతం, వసతి, భోజనం. ఫోన్ : 9030777509, 8077030288 [HA-1436]

■ అనంతపురములో ప్రముఖ లిమిటెడ్ కంపెనీ నందు అడ్వైజర్‌గా పనిచేయుటకు స్త్రీ/పురుషులు, అర్హత : ఇంటర్, డిగ్రీ, ఆపైన, వయస్సు : 30 సం॥ నుండి 65 సం॥, జీతం+కమీషన్ కలదు. మంచి పరిచయాలు గల వారికి ప్రాధాన్యత. సంప్ర : 9866784866, 6300746301. [A-723]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/- | అదనపు లైను రూ. 60/-

ANANTHAPURAMU: 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM: 9912220726, 9912220727
HINDUPUR: 9912220723, 9705346587
GUNTAKAL: 9010223701
TADIPATRI: 9912220722
MADAKASIRA: 9010200238
KADIRI: 9010593486
RAYADURG: 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించాలని పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సెలవులో జెడ్పీ సీఈఓ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కె.భాస్కర్‌రెడ్డి సెలవులో వెళ్లారు. ఈ మేరకు ఆయన శుక్రవారం డిప్యూటీ సీఈఓ అమృతరాజ్‌కు లీవ్ లెటర్‌ను అందజేశారు. వెంటనే శాఖాపరమైన సిమ్‌ను కూడా డిప్యూటీ సీఈఓకు అందజేసి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. ఆయన మళ్లీ వస్తారా? లేదా? అనే అంశం ఇప్పుడు జెడ్పీ ఉద్యోగుల్లో హాట్ టాపిక్ అయింది.

రేషన్ బియ్యం స్వాధీనం

ముదిగుబ్బ: మండల పరిధిలోని సిరగారిపల్లిలో శుక్రవారం ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం కోనుగోలు చేస్తున్న లక్ష్మన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పట్నం ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. అతని వద్ద నుంచి 63 ప్యాకెట్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. బొలెరో వాహనంలో ఇంటింటి వద్ద సేకరించిన బియ్యాన్ని తీసుకొని కర్ణాటకలో విక్రయించడానికి తీసుకెళ్లుతుండగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బొలెరో వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు లక్ష్మన్నపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం





మృతి చెందిన లక్ష్మీదేవి, ఇంద్రజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఎస్.బ్రాహ్మణపల్లికి చెందిన లక్ష్మీదేవి (45) అనే మహిళ విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... లక్ష్మీదేవి భర్త చంద్రశేఖర్ శుక్రవారం పొలం పనులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మీదేవి విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. పొలం నుంచి వచ్చిన భర్త తలుపులు బద్దలు కొట్టి చూడగా అపస్మారకస్థితిలో ఉన్న లక్ష్మీదేవిని చికిత్స నిమిత్తం ముదిగుబ్బ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీదేవి మృతి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బత్తలపల్లిలో మరొకరు...

ధర్మవరం రూరల్: బత్తలపల్లి మండలంలోని రాఘవంపల్లికి చెందిన ఇంద్రజ (22) అనే యువతి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... రాఘవంపల్లికి చెందిన కపాడం కాటమయ్య కుమార్తె ఇంద్రజ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో ఉరికి వేలాడుతు కనిపించడంతో స్థానికుల సహాయంతో ఇంద్రజ మృతదేహాన్ని కిందకు దింపారు. కాగా పోలీసులు గ్రామానికి చేరుకునే లోపే యువతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు కాల్చి వేశారు. యువతి మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

కమనీయం.. బ్రహ్మోత్సవం

- సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగిన లక్ష్మీ చెన్నకేశవుడు



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు ఉదయం సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కనిపించిన స్వామివారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను రెండు కళ్లుగా చేసుకుని వాటినే వాహనాలుగా మలుచుకుని తిరువీధుల్లో స్వామివారు ఊరేగారు. వాహనసేవలకు ఉభయదారులుగా వ్యవహరించిన వారిచేత అర్చకులు స్వామికి పూజలు చేయించారు. సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాల ఊరేగింపునకు ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు.

నేటి వాహన సేవలు ఇలా..: బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీచెన్నకేశవస్వామి శనివారం ఉదయం 6 గంటలకు సర్వభూపాల వాహనంపై, సాయంత్రం 6 గంటలకు సింహవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

'పురం'లో దొంగల హల్‌చల్

- బైక్ డిక్కీలో ఉంచిన రూ.5 లక్షలతో పరార్



బాధితుడు రామకృష్ణప్ప



బైక్‌లో పరారవుతున్న దొంగల వెనుక పరుగెడుతున్న బాధితుడు రామకృష్ణప్ప

హిందూపురం: పట్టణంలో పట్టపగలే దొంగలు హల్ చల్ చేశారు. అందరూ చూస్తుండగా సీటు కింద డిక్కీలో ఉంచిన రూ.5 లక్షల డబ్బు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాలమేరకు... స్థానిక ముదిరెడ్డిపల్లికి చెందిన చీరల వ్యాపారి రామకృష్ణప్ప తన వద్ద పనిచేస్తున్న మగ్గాల కార్మికులకు బట్వాడ ఇచ్చేందుకు శుక్రవారం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బీఎస్‌టీ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న సిటీ యూనియన్ బ్యాంక్‌లో రూ.5 లక్షలు నగదు డ్రా చేశారు. డబ్బును డ్రా చేసి ద్విచక్ర వాహనంలోని సీటు కింద డిక్కీలో దాచుకొని వెళుతూ మార్గమధ్యంలో అజంతా హోటల్ వద్ద మిత్రులు కనిపించగా టీ తాగేందుకు వాహనం ఆపి హోటల్ వద్దకు వెళ్లారు. బ్యాంకు దగ్గరి నుంచే అతన్ని వెంబడిస్తున్న దొంగలు ఇదే అదనుగా వాహనం సీటును లాగేసి డిక్కీలో ఉన్న రూ.5 లక్షలను తీసుకొని బైక్‌పై క్షణాల్లో పరారయ్యారు. బస్టాండ్ ఎదురుగా అత్యంత రద్దీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం రేపింది. ద్విచక్ర వాహనంలో వెళ్తున్న దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని బాధితుడు వాపోయారు. వన్‌టౌన్ సీఐ ఈరన్న, సిబ్బంది ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీల్లో దొంగలు బైక్‌పై పరారవుతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.